# పాఠం 2: చివరి రాత్రి భోజనం

**పాఠ్య సారాంశం:**
ఆఖరి భోజన సందర్భమును ఉపయోగిస్తూ, సమస్త మహిమ ఘనతకు అర్హుడైన యేసు, మనకు మొదటి స్థానము ఇచ్చి తనను తాను ఎలా తగ్గించుకున్నాడో చర్చించుదాము.

**ముఖ్య అంశము:**
ఇతరులకు మొదటి స్థానము ఇచ్చునట్లు యేసు నన్ను నడిపిస్తాడు.

**పాఠ్య లక్ష్యములు:**
* యేసు ఇతరులకు మొదటి స్థానం ఎలా ఇచ్చాడో పిల్లలు చర్చిస్తారు.
* వారు ఇతరులకు మొదటి స్థానము ఇవ్వగల ఒక మార్గమును పిల్లలు గుర్తిస్తారు.

**బైబిలు భాగము:**
యోహాను 13:1–17

**ముఖ్య వచనము:**
**కక్షచేతనైనను వృథాతిశయముచేతనైనను ఏమియు చేయక, వినయమైన మనస్సుగలవారై యొకనినొకడు తనకంటె యోగ్యుడని యెంచుచు మీలో ప్రతివాడును తన సొంతకార్యములను మాత్రమేగాక యితరుల కార్యములను కూడ చూడవలెను.**
**ఫిలిప్పీయులకు 2:3-4**

**అవసరమైన వస్తువులు:**
* బైబిలు
* సూపర్‌బుక్ ఎపిసోడ్ #110
* పెద్ద, శుభ్రమైన, గ్లాసు
* పింగ్–పాంగ్ బాల్స్, బాటిల్ మూతలు, లేక తేలియాడు చిన్న వస్తువులు ఏవైనా
* ఒక జగ్గులో నీరు



## ఆరంభం *(సుమారు 5 నిమిషాలు)*

ఈ రోజు మీరు నాతో ఉండడం చాలా సంతోషంగా ఉంది. ఇక్కడకి మొదటిసారిగా ఎవరు వచ్చారు? మీకు స్వాగతం! పోయినసారి ఇక్కడ ఉన్నవారు, మనము ఏమి నేర్చుకున్నామో చెప్పగలరా?

*పిల్లలు చెప్పు కొన్ని జవాబులను విని ముందుకు కొనసాగండి.*

మన విశ్వాసము బలపడగలదు అని పోయినసారి మనము నేర్చుకున్నాము. దేవునిలో దావీదు కలిగియుండిన విశ్వాసము శూరుడైన గొల్యాతును జయించుటలో అతనికి ఎలా సహాయపడింది అను కథను గూర్చి మనము విన్నాము. తన జీవితములో దేవుడు దావీదుకు చూపిన నమ్మకత్వము తాను శూరుని ఎదుట నిలిచినప్పుడు దేవుడు సహాయం చేస్తాడు అనే విశ్వాసమును దావీదులో పుట్టించింది. ఆయనను మనము నమ్మినయెడల మన కొరకు కూడా దేవుడు అదే చేస్తాడు.

నేడు, యేసువంటి విధేయతను గూర్చి మరియు ఇతరులకు మొదటి స్థానమును ఇచ్చుటను గూర్చి నేర్చుకుందాము. యేసు ఎంతో ప్రత్యేకమైన వ్యక్తి. ఆయన మన పాపముల నుండి మనలను రక్షించుటకు భూమి మీదికి వచ్చిన దేవుని కుమారుడు.

ఆయన శిష్యులతో కలసి చేసిన ఆఖరి భోజనములో, ఇతరులకు మొదటి స్థానమునిచ్చు కొన్ని బలమైన ఉదాహరణలను యేసు మనకు ఇచ్చాడు. యేసు ఉదాహరణను అనుసరించుటలో దేవుడు మనకు ఎలా సహాయం చేస్తాడు అను విషయమును కూడా నేర్చుకుందాము.

మనము ముందుకు కొనసాగక ముందు, నేటి ముఖ్య అంశమును చూద్దాము.

## ముఖ్య అంశము

కదలికలతో ముఖ్య అంశమును పరీక్షించుచుండగా నన్ను వెంబడించండి:

**యేసు** *(ఆకాశము వైపుకు మీ చేతులు పైకెత్తండి.)*
**ఇతరులకు మొదటి స్థానం ఇచ్చునట్లు** *(మీ చేతులను గుంపు వైపుకు చాపండి.)*
**నన్ను నడిపిస్తాడు.** *(మీ చేతులను మీ ఛాతి మీదికి లాగండి.)*

*ముఖ్య అంశమును రెండుసార్లు పునరావృత్తం చేయండి. తరువాత ముందుకు సాగండి.*

ఈ రోజు, మన సూపర్‌బుక్ కథలో, క్రిస్, జాయ్, మరియు గిజ్మో లు యేసు నుండి దీనత్వమును గూర్చి ఇతరులకు మొదటి స్థానమునిచ్చుటను

గూర్చి నేర్చుకోబోతున్నారు. దీనులైయుండుట అంటే దేవుని కంటే మరియు ఇతరుల కంటే మిమ్మును గూర్చి తక్కువగా ఆలోచించుట. యేసు ఒక ప్రత్యేకమైన వ్యక్తి. ఆయన దేవుని కుమారుడు మరియు మన రక్షకుడు.

మీరు చూచుచుండగా, యేసు ఆయన శిష్యుల కంటే భిన్నముగా ఎలా కార్యములు చేస్తున్నాడో గమనించండి. ఏ మార్గము మంచిదో మరియు దీనత్వము అంటే ఏమిటో ఆలోచించండి.

## సూపర్‌బుక్ ఎపిసోడ్ #110ని చూపించండి *(సుమారు 30 నిమిషాలు)*

వావ్! యేసు ఇప్పటి వరకు జీవించినవారందరి కంటే భిన్నముగా ఉన్నాడు. ఇతరులు ఆశించిన విధముగా ఆయన కార్యములు చేయలేదు. నేటి మన కథలో, యేసు దీనుడై ఇతరులకు మొదటి స్థానం ఇచ్చాడు అని మనము చూసాము. ఆయన ఇలా ఎలా చేశాడు? దీనత్వము అంటే ఏమిటో మీలో ఎవరు చెబుతారు?
*పిల్లలు చెప్పే కొన్ని జవాబులను వినిన తరువాత ఇలా అనండి...*

మంచి జవాబులు. దీనులైయుండుట అంటే నిన్ను గూర్చి నీవు దేవుని కంటే, ఇతరుల కంటే తక్కువగా ఆలోచన చేయుట. దీనులైనవారు యేసులో తమ గుర్తింపును పొందుతారుగాని, తమ విజయాలలో కాదు.

ఆఖరి భోజనంలో, యేసు ఆయన శిష్యుల పాదాలను కడిగి, ఇతరులను ఎలా సేవించాలో శిష్యులకు చూపాడు. యేసు ఆయన శిష్యులతో కలిసి రొట్టె విరిచాడు మరియు ద్రాక్షరసమును త్రాగాడు. మనలను రక్షించుట కొరకు యేసు ఆయన శరీరమును మరియు రక్తమును ఇవ్వబోవుతున్నాడని ఈ కార్యము చూపిస్తుంది.

## చర్చ & ముఖ్య వచనము *(సుమారు 10 నిమిషాలు)*

ఒక నిమిషం తీసుకొని మీ స్నేహితులతో మాట్లాడండి. మీరు జవాబివ్వవలసిన మొదటి ప్రశ్న ఇది.

**ప్రశ్న#1:** యేసు ఇతరుల కంటే భిన్నముగా ఎలా వ్యవహరించాడు?
**సాధ్యమైన జవాబులు:** ఆయన తనకు మొదటి స్థానం ఇచ్చుకోలేదు, ఇతరులను సేవించాడు, మరియు ఆయనను ద్వేషించినవారిని ప్రేమించాడు.

మంచిది; ఇప్పుడు ఇంకొక ప్రశ్న అడగాలనుకొనుచున్నాను. ఈ ప్రశ్నను మీ ప్రక్కవారితో చర్చించండి.

**ప్రశ్న#2:** మీ జీవితములో ఒకరికి మొదటి స్థానం ఎలా ఇవ్వగలరు?
**సాధ్యమైన జవాబులు:** నా సొంత అవసరతల కంటే ఎక్కువగా ఇతరుల అవసరతలను గూర్చి ఆలోచించుట, నాదగ్గర ఉన్నదానిని ఇతరులతో పంచుకొనుట, నేను ఆడుకొనుటకు ముందు కుటుంబమునకు సహాయం చేయుట.

మీ సంభాషణలను మీలో ఎవరైనా పంచుకోవాలనుకుంటున్నారా? *(కొన్ని జవాబులను విని వాటికి స్పందించండి.)* కొనసాగుటకు ముందు, మన ముఖ్య అంశమును మరొకసారి చూద్దాము.
*ముఖ్య అంశమును కదలికలతో పునరావృత్తము చేయండి.*

ఇతరులకు మొదటి స్థానం ఇవ్వాలని మనకు జ్ఞాపకము చేసే వచనమొకటి బైబిలులో ఉన్నది. అది క్రొత్త నిబంధనలోని, ఫిలిప్పీ పత్రిక, 2వ అధ్యాయము, 3–4 వచనాలలో కనబడుతుంది. దానిని నేను మీతో పంచుకుంటాను.
*(మీ బైబిలును తెరచి ముఖ్య వచనమును పంచుటకు సిద్ధపడండి.)*

**కక్షచేతనైనను వృథాతిశయముచేతనైనను ఏమియు చేయక, వినయమైన మనస్సుగలవారై యొకనినొకడు తనకంటె యోగ్యుడని యెంచుచు మీలో ప్రతివాడును తన సొంతకార్యములను మాత్రమేగాక యితరుల కార్యములను కూడ చూడవలెను.**

*ముఖ్య వచనమును పిల్లలు కొన్నిసార్లు వల్లించిన తరువాత ముందుకు కొనసాగండి.*

## అభ్యాసిక పాఠము & ముగింపు *(సుమారుగా 15 నిమిషాలు)*

దీనులైయుండి ఇతరులను గూర్చి ఆలోచించమని ఫిలిప్పీ పత్రికలో దేవుడు ఆజ్ఞ ఇచ్చాడు. ఇతరులకు మొదటి స్థానం ఇచ్చినప్పుడు, మనము యేసు వలె ప్రేమిస్తాము. గుర్తుంచుకోండి, ఇతరులను సేవించుట ద్వారా, శిష్యుల పాదాలు కడుగుట ద్వారా, మరియు మన పాపముల క్షమాపణ కొరకు సిలువ మీద ప్రాణము పెట్టుట ద్వారా యేసు తనను తాను దీనుని చేసుకున్నాడు. దీనులుగా జీవిస్తూ ఇతరులకు మొదటి స్థానం ఇచ్చుట ద్వారా మనము ఆయన ఉదాహరణను అనుసరించాలి. మనము యేసు ఉదాహరణను అనుసరించినప్పుడు, ఇతరులు మనలో యేసు ప్రేమను చూసే అవకాశం ఉంటుంది.

ఇతరులను సేవించి దీనులుగా ఉండుట కష్టమే, ఎందుకంటే మనము స్వార్థపరులము కావచ్చు. అయితే ఆయన లేకుండా మనము దీనిని చేయాలని దేవుడు కోరుటలేదు. యేసు వలె ఉండుటకు దేవుడు మనకు సహాయం చేస్తాడు. ఇతరులకు మొదటి స్థానం ఇచ్చి దీనులుగా ఉండునట్లు ఆయన మన హృదయాలలో కార్యము చేస్తాడు. మనము యేసు వలె ఎంతగా కార్యములు చేసి ప్రేమిస్తే, అంత సులభంగా మనము ఇతరులకు మొదటి స్థానమిచ్చి దీనులుగా ఉండవచ్చు.

దీని అర్థమేమిటో మీకు చూపిస్తాను.
*ఖాళీ జగ్గును మరియు పింగ్–పాంగ్ బాల్స్ ను పిల్లలకు చూపించండి.*

మనము ఈ జగ్గులాంటివారమని అనుకోండి.
*పింగ్–పాంగ్ బాల్స్ ను జగ్గులో పెట్టండి.*

పింగ్–పాంగ్ బాల్స్ మన పాపమును పోలియున్నవి. పాపము మనలను స్వార్థపరులుగాను, దురాశగలవారిగాను చేస్తుంది. మనలను మొదటి స్థానములో పెట్టునట్లు పాపము మనలను పురికొల్పుతుంది.
*ఒక జగ్గులో నీరు తీసుకోండి.*

మన జీవితములకు రక్షకునిగా యేసును మనము అనుసరించినప్పుడు, ఆయన మనలను పరిశుద్ధాత్మతో నింపుతాడు మరియు లోపల నుండి మార్చుతాడు.
*నీటిని నిదానంగా పొయ్యండి. ఆ పింగ్–పాంగ్ బాల్స్ నీటి ద్వారా బయటకు త్రోయబడాలి.*

మనకు ఒకప్పుడు ప్రాముఖ్యమైయుండిన పాపపు విషయములు కడిగివేయబడినవి. మన పాపములను ఒప్పుకొని క్షమాపణ కోరినప్పుడు యేసు మనలను శుద్ధిచేస్తాడు.
*చివరికి, జగ్గులో ఉన్న పింగ్–పాంగ్ బాల్స్ అన్ని బయటకు వెళ్లిపోతాయి, మరియు జగ్గు నీటితో నిండియుంటుంది. జగ్గును క్రింద పెట్టండి.*

యేసు ఇతరులకు మొదటి స్థానం ఇచ్చేవాడు. యేసు వలె ప్రేమించుటకు, మనము కూడా ఇతరులకు మొదటి స్థానం ఇవ్వాలి. ఇతరులకు మొదటి స్థానము ఇచ్చుటకు యేసు మీలో కార్యము చేసి మీకు శక్తినిస్తాడు. మీరు ఆయనను అడగాలి అంతే. యేసును వెంబడించుటను గూర్చి మరి ఎక్కువగా తెలుసుకొనగోరితే, ఈ రోజు క్లాసు తరువాత నన్ను అడగండి. ఇప్పుడు, మన ముఖ్య అంశమును మరొకసారి చెబుదాము.
*ముఖ్య అంశమును కదలికలతో పునరావృత్తము చేయండి.*

ఇప్పుడు మీ వంతు. ఇతరులకు మొదట స్థానము ఇవ్వగల కొన్ని మార్గములను మీలో ఎవరు చెప్పగలరు?
*పిల్లల జవాబులు విని కొన్నిటికి స్పందించండి.*

చాలామంచి ఆలోచనలు. ఒక నిమిషం అందరు కన్నులు మూయాలని నేను కోరుచున్నాను. మీలో ఎవ్వరు కూడా అటు ఇటు చూడవద్దు మరియు ఇతరులను ఆటంకపెట్టవద్దు.

మీరు ప్రార్థించుచుండగా నేను మౌనంగా వేచియుంటాను. ఇతరులకు మొదటి స్థానము ఇచ్చుటలో సహాయం చేయుమని దేవుని కోరండి. మీరు దీనులైయుండి ఇతరులను గూర్చి ఆలోచించుటనట్లు మీలో కార్యము చేయమని ఆయనను అడగండి. మీ అంతరంగమును మార్చినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలపండి.
*ఒక్క నిమిషం.*

నేను మీ కొరకు చేయు ప్రార్థనను జాగ్రత్తగా వినండి.

యేసు, నీవు నీ జీవితమును మా కొరకు ఇచ్చినప్పుడు మాకు మొదటి స్థానమిచ్చావు. నీ ద్వారా, మేము ఇతరులకు మొదటి స్థానమివ్వగలము. మా అవసరతలను ప్రక్కనపెట్టి ఇతరులను సేవించుటకు సహాయం చేయుము. యేసు నామములో, ఆమెన్.

ఈ రోజుకు మన వద్ద ఉన్న సమయము ఇంతే. మాతో సమయము గడిపినందుకు ధన్యవాదాలు. మనము వెళ్లుటకు ముందు,ముఖ్య అంశమును మరొకసారి చెబుదాము.

*ముఖ్య అంశమును కదలికలతో పునరావృత్తము చేయండి.*
*పిల్లలను ఇంటికి పంపివేయండి.*

ముగింపు